క్లుప్తంగా

గొప్ప పోరాట యోధుడు ఆర్‌ఎస్


మాట్లాడుతున్న సీపీఎం నేత బలరాం

ఏలూరు (టూటౌన్): నరసాపురం మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘన నివాళులర్పించారు. తుది శ్వాస వరకు సీపీఎం ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో నిర్వహించిన సభలో పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు బి.బలరాం, ఎ.రవి, డీఎన్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు


పవిత్రాలలో శ్రీవారు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉదయం శ్రీవారి మూలవరులకు 108 కలశాలతో అభిషేకం చేశారు. చతుస్థానార్చనం, నిత్య హవనాలు నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. స్వామి వారికి పవిత్రాలతో అలంకరణ చేశారు. 10.45 గంటలకు ఉత్సవ మహాపూర్ణాహుతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. .

అశుభ కార్యక్రమాలను అరికట్టాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ఒక రామాలయం వద్ద అశుభ కార్యక్రమ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను నియంత్రించాలని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి, స్వదేశీ జాగరణ్ మంచ్ నాయకులు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉద్యోగులు రామాలయాన్ని నిర్మించి నిత్య పూజా కైంకర్యాలు సమర్పిస్తున్నారని, ఈ ప్రాంతంలో క్రైస్తవ మత వ్యక్తి ఒకరు మృతి చెందగా ఈ నెల 8న అతని పెద్ద కర్మ నిర్వహణకు ఏర్పాట్లు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఏటా శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నామని, బయట వ్యక్తులు, అధికారుల అనుమతి లేకుండా మాంసాహార భోజనాల ఏర్పాటుకు సన్నాహాలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పవిత్ర ప్రాంతంలో జరుగకుండా నియంత్రించి హిందువుల మనోభావాలను గౌరవించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణపతి నిమజ్జనాన్ని పురస్కరించుకుని నగరంలో వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన భారీ, ఎత్తైన విగ్రహాల ఊరేగింపు నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగు చెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మునిసిపల్ ఆఫీసు, రిక్షా ఘాటి, ఏడు షోరీల సెంటర్, సాంబారు పునుకుల సందు, వేణు గోపాల స్వామి టెంపుల్, విజయ లక్ష్మి థియేటర్, బుద్ధ పార్క్, పంట కాలువ రోడ్డు, టీచర్స్ కాలనీ, హెడ్ పోస్టాఫీసు ఏరియా, పెరుగుచెట్టు, బిర్లా భవన్ సెంటర్, వైఎంహెచ్‌ఏ హాల్ ఏరియా, మార్కెట్ ఏరియా, కత్తేపువీధి, పిచుకగుంట సెంటర్, చిన్న జెండా సెంటర్, వెంకన్నచెరువు రోడ్డు, అగ్రహారం, కెనాల్ రోడ్డు, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, నవాబ్ పేట, బాలాజీ థియేటర్, జంట కల్యాణ మండపాలు, రామకోటి, జ్వాల పరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, అశోక చక్రం రోడ్, పోణంగి రోడ్, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం రోడ్, పాలతూము సెంటర్, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎంహెచ్‌ఓ పోస్టు ఏడాదిగా ఖాళీ

- కార్పొరేషన్‌లో పడకేసిన పారిశుధ్యం
- ఎంహెచ్‌ఓ పోస్టులోకి ఎవరూ రాకపోవడంపై విమర్శలు


ఏలూరు కార్పొరేషన్

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్‌లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్‌ఓ) పోస్టు ఏడాది కాలంగా ఖాళీగా ఉంది. ఎంహెచ్‌ఓగా విధులు నిర్వహించిన డాక్టర్ మాలతి బదిలీ అయ్యి ఏడాది అయ్యింది. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ పోస్టు భర్తీ చేయడంలో ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా ఆ స్థానంలో తిరిగి పాత అధికారే వచ్చే అవకాశం ఉందని, అందుకే కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఏలూరు కార్పొరేషన్‌లో ఉన్న రాజకీయాలను తట్టుకోలేక ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చేందుకు అధికారులు సుముఖత చూపడం లేదని కూడా చెబుతున్నారు. ఇప్పటికైనా ఎంహెచ్‌ఓ పోస్టును భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు టౌన్లుగా నగరం విస్తరణ

ఏలూరు కార్పొరేషన్ 1, 2, 3 టౌన్లుగా ఉంది. మొత్తం 50 డివిజన్ల పరిధిలో 79 సచివాలయాలు ఉన్నాయి. జనాభా దాదాపు 3.70 లక్షలు. ఇళ్లు 88,366 ఉన్నాయి. పట్టణ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో దాదాపు 800 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరినీ మోనిటరింగ్ చేయాల్సిన అధికారి ఎంహెచ్‌ఓ. ఆ పోస్టే ఖాళీగా ఉండటం వల్ల ఇంతవరకు ఇన్‌చార్జి అజమాయిషీలోనే కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

డీసీపై అదనపు భారం

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఏడాదిగా ఎంహెచ్‌ఓ పోస్టు, ఒక నెల నుంచి అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య నెల రోజుల క్రితం వరకు పట్టణ ఆరోగ్య విభాగానికి ఇన్‌చార్జిగా ఉంటూ టూటౌన్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేవారు. డిప్యూటీ కమిషనర్ (డీసీ) శివారెడ్డి వన్‌టౌన్ ప్రాంతంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించేవారు. నెల రోజులు నుంచి పట్టణ ఆరోగ్య విభాగం, రెవెన్యూ విభాగాలకు, అసిస్టెంట్ కమిషనర్ నిర్వహించే విధులకు ఇన్‌చార్జిగా శివారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన కూడా కొద్ది నెలల్లో పదవీ విరమణ చేయనున్నట్టు తెలిసింది. అదే జరిగితే కార్పొరేషన్‌లో కీలక పోస్టులు మొత్తం ఖాళీగా ఉంటాయి.

“

పారిశుద్ధ్య సమస్యలు



నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎంతో కీలకమైంది పట్టణ ఆరోగ్య విభాగం. దీనికి హెడ్‌గా ఉండే మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టు గతేడాదిగా ఖాళీగా ఉండటం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎంహెచ్‌ఓ పోస్టును భర్తీ చేయాలి.

– బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

తక్షణం భర్తీ చేయాలి



ఏలూరు నగరపాలక సంస్థలో ఎంతో కీలకమైన అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టులను తక్షణం భర్తీకి ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి. ఏడాదిగా ఎంహెచ్‌ఓ లేకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. తాజాగా అసిస్టెంట్ కమిషనర్ పోస్టు కూడా ఖాళీ అయ్యింది.

– ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి


పోస్టర్ విడుదల చేసిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): హెచ్‌ఐవీ /ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీష అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు రైల్వే స్టేషన్ ఆటో స్టాండింగ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. శిరీష మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చిన్న చూపుకుండా ఉండడం వంటి పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ సంబంధిత పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ ఎస్ రమాదేవి, గూడ్స్ షెడ్ ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు దిశానిర్దేశం చేసే వ్యక్తి గురువు


ఏలూరు టౌన్: సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ, ఉపాధ్యాయులు


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): ప్రతి విద్యార్థి భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వ్యక్తి గురువని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక దొండపాడు లోని పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ప్రథమ గురువు ఉపాధ్యాయులని, గురువుల పట్ల గౌరవం భక్తి భావనలతో మెలగాలని, వారి నుంచి జ్ఞానాన్ని సముపార్జన చేసి భవిష్యత్తును బంగారం చేసుకోవాలని సూచించారు. జాతీయ బాలల స్నేహపూర్వక న్యాయ సేవల పథకంపై పర్యవేక్షణ న్యాయ సేవాధికార సంస్థల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- బాల బాలికలు ధైర్యసాహసాలు, మనో బలంతో మెలగాలని న్యాయవాది గుళ్లపల్లి పావని అన్నారు. వట్లూరులోని శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఎన్ఆర్ఐ విద్యా సంస్థలు నిర్వహించిన గురుపూజోత్సవంలో పావని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఈఓ కె.తులసీరామ్, కళాశాల డైరెక్టర్ వైవీ కృష్ణారావు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.


ఏలూరు (టూటౌన్): కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

విద్యార్థి భవితకు దిశానిర్దేశం

ఏలూరు టౌన్: తల్లిదండ్రుల అనంతరం విద్యార్థి ఉన్నత భవితకు దిశానిర్దేశం చేసేది గురువులేనని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు అమీనాపేటలోని సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో గురుపూజోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వేపల్లి జీవితం ప్రతి గురువుకూ ఆదర్శంగా నిలుస్తుందని అదనపు ఎస్పీ అన్నారు. సురేష్ చంద్ర బహుగుణ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.స్రవంతి, జి.వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శాంతి నగర్‌లోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థ రీజనల్ ఇన్‌చార్జి టి.ఉమారాణి, ప్రిన్సిపాల్ ఐవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శాంతి, సామరస్యంతో వేడుకలు


ఉత్సవ కమిటీలతో సమావేశమైన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అన్ని మతాల ప్రజలు శాంతి, సామరస్యంతో మెలుగుతూ తమ తమ పండుగలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సూచించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్ టౌన్ సర్కిల్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వాహకులతో శుక్రవారం వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ వేడుకలు నిర్వహిస్తున్న రెండు వర్గాల నిర్వాహకులు పోలీస్ శాఖ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ఇబ్బందులు సృష్టించకుండా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇతర మతాల ఆచారాలను గౌరవిస్తూ, మన భారతీయ సంస్కృతిని కీర్తిని మరింత గొప్పగా చాటుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే వ్యవహరిస్తే చట్టం మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, ఎస్సై మదీనా బాషా, వేడుకల కమిటీల నిర్వాహకులు ఉన్నారు.

వైభవంగా గణనాథుని పూజలు


సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద కోలాటం


దక్షిణపు వీధిలో అన్న సమారాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పునఃపూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రతినిధుల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. 12వ డివిజన్ దక్షిణపు వీధిలో గణనాథునికి భక్తులు ఉండ్రాళ్లు, హారది, పులిహోర, క్షీరన్నం, చక్కెర పొంగలి, పాయసాలతో, అరటిపండ్లు, కొబ్బరికాయలు, పువ్వులు, పసుపు, కుంకుమలతో మండపాలకు విచ్చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భారీ సమారాధన నిర్వహించారు. 42వ డివిజన్‌లో కార్పొరేటర్ అర్జి నాగేశ్వరరావు సత్యవతి ఆధ్వర్యంలో గణనాథుని వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. తంగెళ్లమూడి వంతెన దగ్గర శ్రీ గంగానమ్మ గుడి ఎదురుగా శ్రీ మహా గణపతి మండపంలో ఆదివారపుపేట శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిరం భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, గణనాథుని సంకీర్తనలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మత సామరస్యానికి కృషి చేయాలి


మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొన్న జేపీ


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అన్ని మతాల ప్రజలు సోదరభావంతో మెలుగుతూ ఉన్నారని, ఇదే స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించి నియోజకవర్గంలో మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం జయప్రకాష్ (జేపీ) కోరారు. మహమ్మద్ ప్రవక్త 1500వ జయంతి వేడుకకు రాజా ఎ ముస్తఫా కమిటీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు శుక్రవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద జేపీ పాల్గొన్నారు. నగరంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు ఇలా అన్ని మతాల ప్రతినిధులు తమ మత పరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఇతర మతాల వారిని ఆహ్వానించడం, వారు ఆయా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆరోగ్యకరమైన సంస్కృతికి ప్రతీక అన్నారు. ఇదే సంస్కృతిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేసి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి భాస్కర్ల బాచి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లిపాక సురేష్, జిల్లా కార్యదర్శి కంచుమర్తి తులసి, జిల్లా మైనార్టీ నాయకురాలు రుభిన , పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ


ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటులో జాప్యం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు పేర్కొన్నారు. రాజవరం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దుగ్గిరాల రామారావు కుటుంబానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన రూ.20 వేలు సాయం అందించారు. దుర్గారావుతో పాటు అగ్ని ప్రమాద బాధితులైన తోటసాని సత్యనారాయణ దంపతులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోన గంగరాజు, కాకి నాగేశ్వరరావు, శ్రీరంగనిలయం విశ్వనాథ్, అనంతల సుబ్బారావు, ఆకుల తాతారావు, పాముల నాగమునిస్వామి, కుర్రి తాతబ్బాయి, దాసరి నాగరాజు, నేలపోలు సూరిబాబు, షేక్ పండు, తమ్మిశెట్టి శివ, తమిర్చి వీర్రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో ఆత్మహత్యలు

ద్వారకాతిరుమల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలే రైతుల ఆత్మహత్యలకు కారణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం నాగులపల్లిలో కూరగాయల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ షెడ్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘ మండల మహాసభలో శ్రీనివాస్ మాట్లాడారు. రైతాంగ సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించారు. రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయపాటి సత్యనారాయణ, కార్యదర్శిగా గుర్రం రాంబాబు, ఉపాధ్యక్షులుగా నందమూరి త్రినాథ్, జె.మంగమ్మ, సహాయ కార్యదర్శిగా తూంపాటి మురళీకృష్ణ, గుర్రం పాపారావు, మరో ఐదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పి-4 విధానంతో కార్పొరేటీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి పి-ఫోర్ పేరుతో అన్ని రంగాల్లోనూ పూర్తిస్థాయి ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలు అవలంబిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ఆరోపించారు. సీఐటీయూ 16వ నగర మహాసభలు సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ పతాకాన్ని నగర కమిటీ అధ్యక్షుడు వీవీవీఎస్ ప్రసాద్ ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎం ఇస్సాక్, రజిని వ్యవహరించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పీ ఫోర్ పథకాలు విధానాల ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుంచి వైదొలుగుతోందని విమర్శించారు. ఇప్పటికే విద్యారంగం ప్రైవేటీకరణ కారణంగా లక్షల రూపాయలు ఫీజులు చెల్లించలేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే నూతన మెడికల్ కాలేజీల్లో పీ ఫోర్ భాగస్వామ్యం అని చెప్పి సామాన్యులకు వైద్య విద్యను, వైద్యాన్ని పూర్తిస్థాయిలో దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో కార్మిక ఉద్యోగ వర్గానికి భరోసా లేని విధానాల వల్ల దోపిడీ పెరిగిందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలు సరికాదని హితవు పలికారు. మహాసభలో కార్యదర్శి నివేదికను నగర ప్రధాన కార్యదర్శి వైఎస్ కనకారావు ప్రవేశపెట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర నాయకులు సిహెచ్ సుందరయ్య, నగర కార్యదర్శి వైఎస్ కనకారావు, నాయకులు పంపన రవి కుమార్, గొట్టాపు రవి కిషోర్, జె గోపి, ఎర్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.